క్లుప్తంగా

క్రీడాకారులకు అభినందన



విజేతలను అభినందిస్తున్న కృష్ణమోహన్

మధురవాడ: రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలలో మధురవాడకి చెందిన ముగ్గురు బాలికలు సత్తాచాటుకోవడంతో వారిని పలువురు అభినందించారు. ఇటీవల కాకినాడ ద్రోణ అకాడమీలో నిర్వహించిన పోటీలలో మధురవాడ శ్రీకృష్ణ గ్రామర్ స్కూల్ విద్యార్థినులు కె. లిఖిత, సీహెచ్. సాయి, జ్ఞానేశ్వరిలు కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. పాఠశాలలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో చైర్మన్ ఎం. మోహనకృష్ణ విజేతలను, వ్యాయామ ఉపాధ్యాయుడు, ఎన్ఐఎస్ కోచ్ ఐ. చరణ్‌లను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లిఖిత గతంలో కూడా వివిధ పోటీలలో బంగారు, రజిత, పతకాలు సాధించిందని, విజేతలు మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.విజయ్, సిబ్బంది పాల్గొన్నారు.

గంధవరం హైస్కూల్‌కు వాటర్ ట్యాంకు వితరణ



గంధవరం హైస్కూల్‌కు వాటర్ ట్యాంకును అందజేస్తున్న వాసవి క్లబ్ ప్రతినిధులు

పద్మనాభం: మండలంలోని గంధవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో గంధవరం వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాముల జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఐదు వందల లీటర్ల వాటర్ ట్యాంకు, సీలింగ్ ఫ్యాను వితరణగా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ రీజనల్ చైర్మన్ బండారు బంగారుబాబు, జిల్లా ఇన్‌చార్జులు బొండా సన్యాసిరావు, లక్ష్మణరావు, జోన్ చైర్మన్ కలగర్ల వెంకట బంగారు శెట్టి, మండల అధ్యక్షుడు పసుమర్తి గుప్తాజీ, ట్రెజరర్ చెరుకూరి వెంకటరమణ, కార్యదర్శి అనుమాలు శెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రూ2.లక్షలతో నక్షత్రవనం



మొక్కల ఏర్పాటుకు చదును చేసిన ప్రాంతం

భీమునిపట్నం: పచ్చదనంలో కళకళలాడేందుకు భీమిలి మండల పరిషత్ కార్యాలయం ఆవరణను తీర్చిదిద్దనున్నారు. ఇక్కడ విశాలమైన ఖాళీ స్థలం ఉంది. గతంలో ఇక్కడ చిప్పాడ దివీస్ సంస్థ పలు రకాలైన మొక్కలను, మధ్యలో బుద్దుని బొమ్మ ఏర్పాటు చేసి దీనికి నక్షత్ర వనంగా పేరు పెట్టింది. చిన్నపాటి పార్కులా అందంగా ఉండేది. కొన్నేళ్లుగా ఇక్కడ మొక్కలు ఎండిపోయాయి. దీంతో అధికారులు మళ్లీ ఇక్కడ పచ్చదనం పెంపొందించేందుకు రూ.2 లక్షలు కేటాయించారు. అందులో భాగంగా ఈ ప్రాంతాన్ని మట్టితో చదును చేశారు. ఇందులో పచ్చగడ్డి, తులసితోపాటు మరికొన్ని మొక్కలను పెంచనున్నారు. దీనికి సంబంధించి పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి.

ఎన్‌డీసీ బృందం ఐఐపీఈ సందర్శన

ఏయూ క్యాంపస్: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీ(ఐఐపీఈ)ని గురువారం నేషనల్ డిఫెన్స్ కాలేజ్ నుంచి మేజర్ రాజేష్ అరుణ్ మోఘతో కూడిన నిపుణుల బృందం సందర్శించింది. ఐఐపీఈ సంచాలకుడు ఆచార్య శాలివాహన్ తమ సంస్థలో జరుగుతున్న పరిశోధన సంబంధ అంశాలను వివరించారు. దేశ ఇంధన అవసరాలు, భద్రతకు చేస్తున్న కృషిని పరిశోధన విభాగం డీన్ ఆచార్య కె.విజయ్ కుమార్ తెలిపారు. బయో ఫ్యూయల్స్, బ్యాటరీస్, కార్బన్‌కాప్చర్, సీక్వెస్ట్రింగ్, ప్రత్యామ్నాయ ఇంధన వనరులు, సౌర విద్యుత్, వ్యర్థాల నుంచి ఇంధన ఉత్పత్తి, పవన విద్యుత్, జియో థర్మల్ ఎనర్జీ తదితర రంగాలపై చర్చించారు.

స్పీడ్ బ్రేకర్లు..ఆదమరిస్తే ప్రమాదాలు

- అధికారుల నిర్లక్ష్యంగా కారణంగా ప్రమాదాలు
- జీబ్రాలైన్స్ లేకపోవడంతో పసిగట్టలేకపోతున్న వాహనదారులు



తగరపువలస జీడిపప్పుల దుకాణాల ముందు జీబ్రా లైన్ లేని స్పీడ్ బ్రేకర్



బాలాజీనగర్ సర్వీస్ రోడ్డులో మార్కింగ్ లేకుండా స్పీడ్ బ్రేకర్

తగరపువలస: రద్దీ ప్రాంతాల్లో..ప్రధాన జంక్షన్‌లలో వేగనియంత్రణ కోసం స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తారు. అయితే ఇప్పుడు అవే స్పీడ్ బ్రేకర్లు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. అధికారుల చిన్నపాటి నిర్లక్ష్యానికి పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు. వేగంగా వచ్చే వాహనదారులకు కనిపించేలా స్పీడ్ బ్రేకర్లకు జీబ్రా లైన్స్ వేస్తారు. అయితే ఇక్కడేర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లకు జీబ్రా లైన్స్ లేవు. రేడియం స్టిక్కర్స్ ఉన్నాయి. దీంతో పగటి పూట ప్రయాణించేవారంతా ఈ స్పీడ్ బ్రేకర్లను గుర్తించలేకపోతున్నారు. వేగంగా వచ్చి స్పీడ్ బ్రేకర్లపై వెళుతుండడంతో కొందరు అదుపు తప్పి పడిపోతున్నారు. జాతీయరహదారిని ఆనుకుని ఉన్న సర్వీస్ రోడ్డులో నిత్యం ఈ ఇబ్బందులే తలెత్తతున్నాయి. ఆనందపురం నుంచి మహరాజుపేట వరకు ఎనిమిదిచోట్ల అండర్‌పాస్ రహదారులు ఉన్నాయి. వీటికి ఇరువైపులా ముఖద్వారాలలో ఉన్న సర్వీస్ రోడ్లు వద్ద ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లు ఇప్పుడు వాహనదారులకు ప్రాణసంకటంగా మారాయి.

భారీ వాహనాలు జాతీయరహదారి మీదుగా వెళుతున్నా స్థానికంగా ఉండే ప్రయాణికుల సౌకర్యార్థం సిటీబస్సులు, ఆటోలు, కార్లు వేలాది సంఖ్యలో ద్విచక్రవాహనాలు 24 గంటలూ సర్వీస్‌రోడ్డు లోనే ఎక్కువగా రాకపోకలు సాగిస్తున్నాయి. అండర్‌పాస్ రహదారులు, స్పీడ్‌బ్రేకర్లు గుర్తించలేని స్థానికేతరులు నిత్యం ఈ మార్గంలో ఏదో ఒకచోట కుదుపులకు గురై పడిపోతున్నారు. జరుగుతున్న వరుస ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని ఆనందపురం నుంచి జిల్లా సరిహద్దులలోని మహరాజుపేట కూడలి వరకు సర్వీస్‌రోడ్లపై జీబ్రాలైన్స్ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు ఆద్యుడు పొట్టి శ్రీరాములు



పొట్టి శ్రీరాములు జీవీఎంసీ హైస్కూల్‌లో నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు



కృష్ణంరాజుపేట యూపీ స్కూల్‌లో నివాళులర్పిస్తున్న విద్యార్థులు

తగరపువలస : భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు అమరజీవి పొట్టి శ్రీరాములు ఆద్యుడని భీమిలి పొట్టి శ్రీరాములు జీవీఎంసీ హైస్కూల్‌లో ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయురాలు ఎస్.సుజాతకుమారి అన్నారు. గురువారం పాఠశాల ఆవరణలో పొట్టి శ్రీరాములు జయంతిని ఆదర్శ హిందీ ప్రేమీ మండలి భీమిలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. సత్యం, అహింస, హరిజనోద్ధరణ తదితర సామాజిక అంశాలపై జీవితాంతం ఆయన కృషి చేసినట్టు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆయన జీవిత విశేషాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో మండలి గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు, ఉపాధ్యాయులు అల్లాడ శ్రీనివాసరావు, ఇమంది వెంకటరావు, అల్తి రామకృష్ణ, కేవీజీ విజయలక్ష్మి, వైవీ రవికుమార్, గారి దేవి పాల్గొన్నారు.

భీమిలి మండలం శింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేట యూపీ పాఠశాలలో ఉపాధ్యాయులు జి.సత్యనారాయణ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి నిర్వహించి ఆయన జీవితచరిత్రను విద్యార్థులతో ప్రాజెక్ట్ తయారు చేయించారు. విద్యార్థులకు బహుమతులు అందించారు.

ఘనంగా పొట్టి శ్రీరాముల జయంతి

పద్మనాభం: మండలంలోని పలు చోట్ల పొట్టి శ్రీరాముల జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో పొట్టి శ్రీరాముల చిత్ర పటానికి ఇన్‌చార్జి ఎంపీడీవో పి.రాధ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ ఎం.ఉషాకుమారి, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు. రెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం విజయకుమారి పొట్టి శ్రీరాముల చిత్ర పటానికి పూలమాలలు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కళావతి, ధనలక్ష్మి పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములు చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీడీవో రాధ, మండల పరిషత్ సిబ్బంది

శ్రీరామ నవమి ఉత్సవాలకు ఏర్పాట్లు

పీఎం పాలెం: ఈ ఏడాది శ్రీరామ నవమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ తెలిపింది. ఈ నెల 22వ తేదీ మొదలుకొని 30వరకు పీఎంపాలెం మూడో బస్టాపు వద్దగల రామాలయంలో నవమి ఉత్సవాలు సందర్భంగా ప్రతిరోజూ సీతారాములకు ప్రత్యేక పూజాలు నిర్వహిస్తారు. 22వ తేదీ సాయంత్రం తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినం సందర్భంగా పంచాంగ శ్రవణం, ఉగాది పచ్చడి వితరణం ఉంటుంది. 23వ తేదీ ఉదయం 8 గంటలకు స్వామివారి కల్యాణరాటోత్సవం జరుగుతుంది. 30వ తేదీ ఉదయం 9.30 గంటలకు స్థానిక రామాలయం వద్ద సీతారామచంద్ర స్వామి కల్యాణాన్ని భారీ ఎత్తును నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది. కల్యాణ అనంతరం అన్నసంతర్పణ ఉంటుందని కమిటీ తెలియ జేసింది.

గీతంలో ఆండ్రూ చాట్‌ఫీల్డ్



ఆండ్రూ చాట్‌ఫీల్డ్‌ను సత్కరిస్తున్న వీసీ దయానంద సిద్దవట్టం

కొమ్మాది: ఔషధ పరిశ్రమ ఫైజర్ ఆసియా ఫసిఫిక్ ఉపాధ్యక్షుడు ఆండ్రూ చాట్‌ఫీల్డ్ గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయాన్ని గురువారం సందర్శించారు. గీతంతో కుదుర్చుకున్న అవగాహనా ఒప్పందంలో భాగంగా ఫైజర్ అటానమస్ టీమ్ ఎంపికైన గ్రామీణ ప్రాంత బాలికలకు రసాయనశాస్త్ర విభాగం ప్రత్యేక కోర్సు నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న వారితో ఆయన భేటీ అయ్యారు. గీతంలో లభిస్తున్న శిక్షణపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయనను గీతం వీసీ దయానంద సిద్దవట్టం, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ తదితరులు సత్కరించారు.

బీచ్‌ను కలుషితం చేస్తే చర్యలు



మహిళలతో మాట్లాడుతున్న జెడ్సీ రాము

భీమునిపట్నం: బోయిపాలెం పరిధిలో బీచ్‌ను కలుషితం చేసినా, వ్యర్థాలు వేసినా కఠిన చర్యలు తీసుకుంటామని జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము హెచ్చరించారు. బోయివీధిలో నివాసముండే వారంతా బహిర్భూమిగా భీమిలి బీచ్‌ను వినియోగిస్తుండడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బీచ్‌రోడ్డులో జరుగుతున్న ఆధునీకరణ పనుల్లో భాగంగా రోడ్డుపొడవునా రక్షణగోడ నిర్మిస్తుండగా తాము బీచ్‌లోకి వెళ్లడానికి ఇబ్బందిగా ఉంటుందని గురువారం ఈ ప్రాంతీయులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారితో జెడ్సీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇళ్లవద్ద మరుగుదొడ్డి నిర్మించుకోవాలని, అలా కాకుండా బీచ్‌ను బహిర్భూమిగా వినియోగిస్తే చర్యలు తప్పవన్నారు ఇక్కడి పబ్లిక్ మరుగుదొడ్లు సరిగ్గా పనిచేయడం లేదని వాటికి మరమ్మతులు నిర్వహించాలని కోరగా ఇందుకు చర్యలు తీసుకుంటామని జెడ్సీ హామీ ఇచ్చారు. ఇందులో అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాస్, పారిశుధ్య అధికారి బి.మహలక్ష్మినాయుడు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చెరువు గెడ్డ మార్గంలో వ్యర్థాలు



చెరువు గెడ్డ మార్గంలో పేరుకుపోయిన వ్యర్థాలు

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస చెరువు గెడ్డ మార్గంలో వ్యర్థాలు పేరుకుపోవడంతో మురుగునీటి ప్రవాహానికి ఇబ్బందిగా మారింది. యాతపేట– కుమ్మరిపాలెం రహదారిలో ఓ విద్యా సంస్థ నుంచి వ్యర్థాలు జాతీయరహదారి కింద మార్గం ద్వారా అవతలి రోడ్డులో గెడ్డలో కలుస్తున్నాయి. ఈ గెడ్డ వంకర్లు తిరిగి చెరువుకు అనుసంధానంగా ఉండడంతో మురుగునీరు గెడ్డలో కలుస్తుంది. గెడ్డ పొడవునా చెత్త పేరుకుపోవడంతో మురుగునీటి ప్రవాహానికి ప్రతిసారి ఆటంకం కలుగుతోంది. దీంతో పంచాయతీలో తాగునీటి వనరులు తరచూ కలుషితమవుతున్నాయి. అలాగే జాతీయరహదారిని ఆనుకుని గెడ్డలో పేరుకుపోయిన వ్యర్థాల కారణంగా రాకపోకలు సాగించేవారికి దుర్గంధం వెదజల్లుతోంది. గతంలో విద్యా సంస్థకు పంచాయతీ నుంచి నోటీసులు జారీ చేసినా మార్పు రావడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఘనంగా గణిత శాస్త్రవేత్త లక్ష్మీకాంతం శత జయంతి ఉత్సవాలు



అతిథిని సత్కరిస్తున్న జీవీఎంసీ అధ్యాపకులు, సిబ్బంది

మధురవాడ: గణిత శాస్త్రవేత్త, విద్యావేత్త ఆచార్య వి. లక్ష్మీకాంతం శత జయింతి ఉత్సవాలు ఏడాది పాటు ఘనంగా నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఏబీ కోటేశ్వరరావు చెప్పారు. ఈ మేరకు గాయిత్రి విద్యాపరిషత్ ఇంజినీరింగ్ కళాశాల మినీ ఆడిటోరియంలో లక్ష్మీకాంతం జ్ఞాపకార్థం ఐదు రోజులుగా జీవీపీ, ప్రొఫెసర్ వి. లక్ష్మీకాంతం ఇన్‌స్టిట్యూట్ ఫర్ అడ్వాన్స్‌డ్ ఎడ్యుకేషన్ స్టడీస్ విద్యార్థులు పలు రకాల వర్క్‌షాపులు నిర్వస్తున్నారు. ఈ ఉత్సవాలు ప్రారంభ కార్యక్రమానికి మిజోరాం ఎన్ఐటీ డైరెక్టర్ ఎస్.సుందర్ హాజరై మిషన్ లెర్నింగ్ టెక్నిక్స్ విద్యార్థులకు వివరించారు. గురువారం ముగింపు కార్యక్రమానికి మద్రాసు ఎన్ఐటీ విభాగాధిపతి వి. వెత్రివల్ హాజరై ఆప్టిమైజేషన్ గురించి విపులంగా వివరించారు. గాయిత్రి విద్యాపరిషత్ అధ్యక్షుడు ప్రొఫెసర్ పీఎస్ రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ ప్రొఫెసర్ రాజగణపతి, ప్రిన్సిపాల్ ఏబీ కోటేశ్వరరావు, ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ జె. వసుంధరాదేవి, డాక్టర్ వీఎస్ఆర్‌కే ప్రసాద్, డాక్టర్ వేదుల శాస్త్రి, పలువురు హెచ్‌వోడీలు, ప్రొఫెసర్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెత్త సేకరణకు యూజర్ చార్జీలు చెల్లించండి



చెత్త సేకరణపై అవగాహన కలిగిస్తున్న జెడ్సీ రాము

తగరపువలస: చెత్త సేకరణకుగాను యూజర్ చార్జీలు చెల్లించి సచివాలయ సిబ్బంది, జీవీఎంసీ అధికారులకు సహకరించాలని భీమిలి జెడ్సీ బొడ్డేపల్లి రాము కోరారు. గురువారం రెండోవార్డు సంగివలస రచ్చబండ వద్ద తడి, పొడి, ప్రమాదకరమైన చెత్త సేకరణ గురించి అక్కడి మహిళలకు అవగాహన కలిగించారు. నిత్యం నివాస ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చెత్త, తడి నిల్వ కారణంగా ప్రమాదకరమైన బాక్టీరియా, దోమలు వృద్ధి చెంది వ్యాధులను వ్యాపింపజేస్తాయన్నారు. చెత్తను విధిగా వీధులలోకి వచ్చే క్లాప్ వాహనాలకే అందించాలన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు బి.మహలక్ష్మినాయుడు, శ్రీకాంత్, వైఎస్సార్‌సీపీ నాయకులు పీతల వెంకట అప్పారావు, దొడ్డి ప్రసాద్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

గీతంలో అట్టహాసంగా జెమ్ -23 ప్రారంభం



కార్యక్రమంలో పాల్గొన్న గీతం అధ్యాపకులు

కొమ్మాది: వాణిజ్య విద్యను అభ్యసించే విద్యార్థుల్లో న్యాయకత్వ లక్షణాలతో పాటు క్రీడ, సాంస్కృతిక నైపుణ్యాలను వెలికి తీయడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం బిజినెస్ స్కూల్ మూడు రోజులు పాటు నిర్వహిస్తున్న గీతం ఎక్సెలెన్స్ మీట్ (జెమ్) గురువారం అట్టహాసంగా ప్రారంభమైంది. సీనియర్ ప్రొఫెసర్ కె.అశోక్ జ్యోతి వెలిగించి ఉత్సవాలను ప్రారంభించారు. 30 ఏళ్లుగా జెమ్‌ను జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్నామని, ఎందరో విద్యార్థుల ప్రతిభకు వేదికగా జెమ్ నిలిచిందన్నారు. జెమ్ -23 లో భాగంగా గీతం ప్రీమియర్ లీగ్ పేరిట క్రికెట్ పోటీలను, వాలీబాల్, త్రోబాల్ ఇతర పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగించండి

దాబాగార్డెన్స్: నగరంలో ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణలు తొలగించాలని జీవీఎంసీ కమిషనర్ పి. రాజాబాబు పట్టణ ప్రణాళికాధికారులను ఆదేశించారు. క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా కమిషనర్ గురువారం చినవాల్తేర్ నుంచి అప్పుఘర్ వరకు నడక మార్గాన పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఫుట్‌పాత్‌లపై చాలా వరకు ఆక్రమణలు ఉన్నాయని, కార్ల సర్వీసింగ్ సెంటర్ వద్ద చాలా వరకు ఫుట్‌పాత్‌లపై దుకాణాల వంటివి పెట్టకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులను ఆదేశించారు. ఎలక్ట్రికల్ పోల్స్‌కు కేబుల్ వైర్లు వేలాడుతున్నాయని, వాటిని క్రమబద్ధీకరించి కట్టాలని, అనవసర కేబుల్ వైర్లు వేలాడుతున్నాయని, వాటిని తొలగించాలని ఆదేశించారు. పలు చోట్ల మొక్కలకు ట్రిమ్మింగ్ చేసి ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలన్నారు. ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు తొలగించేలా ఆ స్థల యజమానులకు తెలిపి, వారిచే శుభ్రం చేయించాలన్నారు. ప్రధాన రోడ్లకు కనెక్ట్ అవుతున్న అప్రోచ్ రోడ్ల మరమ్మతులు చేపట్టి ఆకర్షణీయంగా కనిపించేలా చూడాలన్నారు. రేసపువానిపాలెం గణేష్‌నగర్ వద్ద ఉన్న ఖాళీ స్థలాన్ని ఆ స్థల యజమానులచే శుభ్రం చేయించాలని ఆదేశించారు. పారిశుధ్యం సంతృప్తికరంగా ఉన్నప్పటికీ ఇంకా మెరుగ్గా ఉండేలా చూడాలని, సెంట్రల్ మీడియంలో ఆకర్షణీయంగా ప్లాంటేషన్ పచ్చగా కనిపించే విధంగా చర్యలు చేపట్టాలని, రాత్రిపూట పశువుల సంచారం లేకుండా చూడాలని ఆదేశించారు.

నాసిరకం విత్తనాలతో పంటకు నష్టం



మొక్క జొన్న రకం కవర్ చూపిస్తున్న రైతు

పద్మనాభం: మండలంలోని విలాస్కాన్‌పాలెంలో ఓ ప్రవేటు కంపెనీ నాసిరకం విత్తనాలు సరఫరా చేయడంతో మొక్కజొన్న వెన్ను రాలేదు. ఈ గ్రామానికి చెందిన బాయి శ్రీను రెడ్డిపల్లిలో ప్రయివేటు డీలర్ వద్ద మొక్కజొన్న విత్తనాలు కొని ఎనిమిది ఎకరాల్లో వేశాడు. వెన్నులు రాకపోవడంతో భారీగా నష్టపోయాడు. రూ20లు నుంచి రూ.40వేలు వరకు పంట నష్టపోయాడు. పోయిన పంటను తీయడానికి సుమారు రూ.50వేలు ఖర్చు అవుతుందని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. సంబందిత శాఖ అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని రైతు శ్రీను కోరారు.

సిరులతల్లికి నేడు క్షీరాభిషేకం

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దర్ని అనుమతించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514 లో సంప్రదించవచ్చు.

సాంకేతిక యువజనోత్సవం ప్రారంభం



మాట్లాడుతున్న పులమరిశెట్టి మురళి

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజినీర్స్ సంయుక్త నిర్వహణలో జాతీయ స్థాయి సాంకేతిక యువజనోత్సవం ఐస్క్వేర్ ఆర్ -2023 గురువారం ప్రారంభమైంది. ఐటీ సంస్థ క్యాప్ జెమిని, వీఎల్ఎస్ఐ ఇంజినీరింగ్ విభాగం ఉపాధ్యక్షుడు పులమరిశెట్టి ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఇంజినీరింగ్ విద్యార్థులు సమకాలిన సాంకేతిక మార్పులపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గీతం అకాడమిక్ ప్రొ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ జయశంకర్ వారియర్ తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్ ఉద్యోగులకు ఎముక సాంద్రత పరీక్ష



సిబ్బందికి ఎముక సాంద్రత పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

మహారాణిపేట: కేజీహెచ్‌లో రెగ్యులర్, కాంట్రాక్టు, సెక్యూరిటీ, శానిటేషన్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు గత రెండు రోజులుగా ఉచిత ఎముక సాంద్రత పరీక్ష నిర్వహిస్తున్నారు. 45 సంవత్సరాలు దాటిన స్త్రీలు, 55 సంవత్సరాలు దాటిన పురుషులకు ఈ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు ఏఆర్ఎం డాక్టర్ జగదీష్‌కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్‌కుమార్ రెండు రోజుల పాటు 242 మందికి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ బోన్ డెన్సిటీ తగ్గితే ఎముకలు విరిగిపోవచ్చన్నారు. ఎముకల్లో కాల్షియం సాంద్రత తక్కువగా ఉంటే ఆలసట, నీరసానికి గురి కావడంతో పాటు ఎక్కువ దూరం నడవలేరని అన్నారు. అలాంటి వారు ఆకుకూరలు, మాంసాహారంతో పాటు కాల్షియం టాబ్లెట్లు తీసుకోవాలని తెలిపారు.

ఐఏఎస్ఈకి యూబీఏ నిధుల మంజూరు



యూబీఏ నిధులు స్వీకరిస్తున్న ఆచార్య శోభశ్రీ

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ ఇన్ ఎడ్యుకేషన్(ఐఏఎస్ఈ)కి ఉన్నత్ భారత్ అభియాన్(యూబీఏ)లో భాగంగా కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ రూ॥50 వేలు సీడ్ ఫండ్ మంజూరైంది. ఈ మేరకు గురువారం ఈ నిధులను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి నుంచి ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆచార్య టి.శోభశ్రీ అందుకున్నారు. ఐఏఎస్ఈ దత్తత తీసుకున్న గ్రామాల అభివృద్ధికి ఈ నిధులను వినియోగించనున్నట్టు శోభశ్రీ తెలిపారు. ఈ కార్యక్రమంలో యూబీఏ సమన్వయకర్త పావని, ఐఏఎస్ఈ సమన్వయకర్త డాక్టర్ సోనీ హవీలా, తదితరులు పాల్గొన్నారు.